# డబ్బుజబ్బు

వీరభద్రరావు పమ్మి



సుభద్ర కిటికీలోంచి బైటకి చూస్తోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అందరూ ఎక్కడో అక్కడ సర్దుకునే సమయమది. ఎండే రోగిష్టి మనిషిలా చిరుకుగా ఉంది.

ఆమె పెద్దకొడుకు రమేష్ స్నేహితుడింటికి వెళ్ళాడు.

కూతురు జయ మిషన్ కుట్టు నేర్చుకోడానికి ఎవరింటికో

వెళ్ళింది. చిన్నపిల్లాడు మురళీ స్కూలుకెళ్ళాడు.



ఇంట్లో తనొక్కత్తే ఉన్నా నన్న ఆలోచన సుభద్రకి కలిగింది. అంతలోనే "గదిలో ఆయన కూడా ఉన్నారుగా!" అనుకుంది.

"ఆయన ఉన్నా లేనట్టే."

మనసు శూన్యంగా ఉంటే బాగుండును. ఇలాంటి పిచ్చి ఆలోచనలు రావు—అనుకుంది.

ముసలి గోడగడియారం......

ఠంగ్....ఠంగ్ పదిగంటలు కొట్టింది. సుభద్ర గోడ గడియారం కేసి జాలిగా చూపింది.

నీకూ నాకూ ఈమరణబతుకు తప్పదు. అన్నట్టున్నాయి ఆమె చూపులు.

"ప్రతి గంటకు ఈ మందు ఓ చెంచాడు తాగించండి. మర్చి పోకండి. ఒక్కడోస్ మర్చి పోయినా ప్రమాదమే. ఈ మందు వల్ల ఇరవై నాలుగంటలు నిలబాటు చేస్తే పరవాలేదు."

డాక్టర్ మాటలు జ్ఞాపకం వచ్చాయి. లోపలికెళ్ళి భర్తచేత మందు తాగించింది. అతను మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

సుభద్ర మళ్ళీ కిటికీలోంచి బైటికి చూస్తోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగానే ఉంది.

* * *

సుభద్ర సగటు ఆడదానిలాగే మామూలు ఆశలతో కాపురాని కొచ్చింది. ఆ రోజుల్లో గవర్నమెంటాఫీసులో పన్చేసే రామనాథానికిచ్చి పెళ్ళిచేసినందుకు ఆమె తండ్రిని వాళ్ళ ఊళ్ళో అంతా అభినందించారు.

ఆమెకప్పుడు గర్వం కూడా కలిగింది.

పల్లెటూరును వదిలి పట్నంలో బతకబోతున్నందుకు ఆమె ఆనందపడింది కూడా!

పెళ్ళయి కాపురానికొచ్చిన మొదటి రెండేళ్ళు బాగానే గడిచింది. ప్రపంచంలోని ఆనందమంతా తనకి, మొగుడికి మాత్రం లభించినట్టుగా అనిపించింది. అది కావాలని, ఇది కావాలని భర్తని ఇబ్బంది పెట్టకుండా ఉన్నదాంటో సర్దుకుని తృప్తిపడి, అదే ఆనందమని మురిసిపోయింది.

అప్పుడే....

అబ్బాయి కావాలని తను, అమ్మాయి కావాలని భర్త సరదాకే పోట్లాడుకున్నారు. ఆమె కోరిన ప్రకారం అబ్బాయే పుట్టాడు. కాని నెలతిరకుండానే చచ్చిపోయాడు. ఆ రోగానిక్కారణం ఏమిటో తెల్సుకున్న డాక్టర్లు ఆ రోగానికి మంచి ఇంగ్లిషు పేరు పెట్టారు.

పురుడు తర్వాత పురుడు. పురుడు తర్వాత పురుడు....నల్గురు పిల్లలు పుట్టడం, పోవడం జరిగిపోయింది.

కనిపించే చెట్టుకి, పుట్టకి మాత్రమే కాకుండా కనుపించని దేవుళ్ళకు కూడా మొక్కుకుంది

"వాళ్ళని చంపేసే ఉద్దేశం ఉన్నపుడు అస్సలు పిల్లల్నివ్వకు భగవంతుడా!" అని వేడుకుంది.

అసలా రోజుల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులు సరిగా తెలి

యవు కావి, తెల్పుంటే అసలు పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడేది.

సరిగ్గా అప్పుడే ఆమె మావ గారు వాళ్ళదగ్గరకి వచ్చారు. ఆయన కొడుకువి, కోడల్ని చూసి వెడదా మనిరాలేదు. తన ఆస్థిపాస్తులు, ఇన పెట్టి తాళంచెవులు కొడుక్కి అప్ప జెప్తామవి రాలేదు.

పల్లెటూళ్ళో తనకున్న రెండక రాలు, చిన్నఇల్లు బ్రాకెట్టాడేసి - చుట్టముక్కకూడా కొనుక్కోలేని స్థితిలో కొడుకు దగ్గర తన మిగిలిన కాలం గడపాలవి వచ్చారు.

మావగారు వచ్చారవి అసలే నలిగిపోయిన కుటుంబం ఇంకా నలిగిపోతుందని ఆమె బాధపళ్ళేదు. సరికదా....

"పాపం ఆయనకి మాత్రం ఎవరున్నారు? తనకున్న ఒక్క కొడుకు దగ్గర ముసలితనం వెళ్ళ బుచ్చాలనుకోవడం సహజం కదా!" అనుకుంది.

"అదే ఉంటే నా బ్రతుకిలా బండలయ్యేది కాదు" అని పెళ్ళాప్ని తల్చుకువి మావగారు చెప్పే పెట్ట వేదాంతాన్ని, ఖళ్ళు ఖళ్ళున విసిపించే ఆయన దగ్గును రయ్యమవి లేచిపోయే ఆయన కోపాన్ని భరించింది.

మళ్ళీ పురుళ్ళు, ఖర్చులు, మందులు, జబ్బులు....సుభద్రకి ముగ్గురు పిల్లలు పుట్టడం, ఆ ముగ్గురు బతికి బట్టకట్టడంజరిగింది.

అప్పుడు మామగారు మంచాన పడ్డారు. డాక్టర్లు మళ్ళీ ఆ రోగావి కేదో మంచి పేరే పెట్టారు. మందులు, డాక్టర్లు వాటి తాలూకు ఖర్చులు, భరించి భరించి మొగుడు రాట్నంలా ఐపోయాడు.

అతన్ని చూస్తే ఆమెకు జాలి కలిగేది.

కావి జాలి కష్టాల్ని, బాధల్ని తీర్చదు. డబ్బు మాత్రమే వాటివి తీరుస్తుంది. డబ్బు లేదు కాబట్టి ఆమె భర్త కష్టాల్ని, బాధల్ని ఒంటికి పట్టించేసుకున్నాడు.

రకరకాల వైద్యాలు చేయించు కున్నాక కొడుకు మరిన్ని అప్పుల్లో మునిగిపోయాక ఆమె మావగారు తనువు చాలించారు.

"అదృష్టవంతుడు కొడుకు చేతుల మీదుగాపోయాడు" అను కున్నారు చుట్టాలంతా.

ముసలాయన వైద్యానికయిన అప్పే పూర్తిగా తీరలేదు. మళ్ళీ ఆయన కర్మకాండలకి అప్పు

రామనాథం ఎక్కడ ఎలా అప్పులు చేస్తున్నాడో, ఎలా డబ్బు తెస్తున్నాడో అతనికితప్ప మరెవ్వ రికి తెలియదు.

సుడిగుండంలో అతనొక్కడే తిరుగుతున్నాడు.

రాట్నం బతుకు—గానుగెద్దు జీవితం.

లంచాలురాని ఆఫీసులో పని చేస్తున్నందుకు అప్పుడప్పుడు బాధ పడినా "నిజాయితీగా బతుకుతున్నాను" అన్న మధ్యతరగతి గర్వం అతన్ని ఊరడించేది.

పెద్ద కొడుకు బియస్సీ చదువుతున్నాడు. చిన్నకొడుకు, పిల్ల స్కూల్లో ఉన్నారు.

పెద్దాడి చదువై వాడూ ఏదైనా ఉద్యోగంలోచేరి నాక్కాస్త చేయూత నిస్తే ఈ అప్పుల పళ్ళ చక్రాల బాధలోంచి తప్పుకుంటాను" అని రామనాథం ఆశగా భవిష్యత్తులోకి ఆకాశంలోకి చూస్తున్న సమయంలోనే....

అతనికి జబ్బు చేసింది.

* * *

ముసలి గోడ గడియారం పదకొండు కొట్టింది. సుభద్ర వెళ్ళి మొగుడికి మందు ఇచ్చి బయటకు వస్తుంటే కొడుకు వచ్చాడు. అతనికి అన్నం పెట్టింది అతను మళ్ళీ హడావుడిగా వెళ్ళిపోయాడు.

సుభద్ర మళ్ళీ కిటికీలోంచి బయటకు చూస్తోంది.

బయటంతా శూన్యం.

* * *

ఆఁ. ఔను. రామనాథానికి జబ్బు చేసింది. మామూలు జ్వరంగా మొదలైన రోగం, రకరకాల వంకర్లు, టింకర్లు తిరిగింది.

రోజు రోజుకీ పరిస్థితి క్షీణిస్తోందే తప్ప మెరుగుపడే సూచనలు కనపడడంలేదు.

రకరకాల డాక్టర్లకి చూపించారు. అందరూ ఆ రోగానికి తలో ఇంగ్లీషు పేరు పెట్టారు. కాని రోగం తగ్గలేదు.

రోజులు వారాలయ్యాయి. వారాలు నెలలయ్యాయి. నెలలు సంవత్సరాలయ్యాయి.

ఔను. అతనికి రోగమొచ్చి రెండు సంవత్సరాలైంది. అదేం రోగమో ఎవ్వరికీ తెలియదు.

నీరసం, కాళ్ళు చేతులు నొప్పి నడవలేని అశక్తత, నడవడానికి ప్రయత్నిస్తే కళ్ళు తిరుగుతున్నట్టుగా ప్రపంచమంతా తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. రాను రానురాను అసలు మంచంమీంచి లేవలేని తనం....

అన్నీ పక్కమీదే. లేచి నిలబడి ఆర్నెల్లైంది.

సంవత్సరంనుండి జీతంలేని శలవు. ఊరినిండా మళ్ళీ అప్పులు.

తిండి గడవాలంటే అప్పులు.
వైద్యంకోసం అప్పులు.
మందుల కోసం అప్పులు.
ఇంట్లో ఉన్న వస్తువులు ఒక్కొక్కటి అమ్మకం పెట్టారు.
పెద్దకొడుక్కి బియస్సీ పూర్తయ్యింది- ఉద్యోగం లేదు.
ఆడపిల్లకు చదువెందుకని ఆయను స్కూలు మానిపించారు. ఆఖరి కత, రెండోవాడు పైకప్పులేని గవర్నమెంట్ స్కూల్లో చదువుతున్నాడు. అక్కడ చదువు తప్ప అన్నీ వస్తాయి".
ఇల్లు గడవడానికి డబ్బు కావాలి.
మందులకు డబ్బు కావాలి.
అప్పులు తీర్చడానికి డబ్బు కావాలి.
కొత్త అప్పులు చెయ్యాలంటే పాత అప్పులు తీర్చాలి.
ముందు, వెనుక, ఎడమ, కుడి ఎటు తిరిగినా డబ్బు కావాలి.
కాని లేనిదదే!
పిల్లాడు పుట్టినప్పుడు పోసే ఆముదం దగ్గర్నుంచి, మనిషి చచ్చాక పోసే కిర్సనాయిల్ వరకూ అన్నిటికీ డబ్బు కావాలి.
ప్రపంచంలో ఏ దేశంలోను, ఏకాలంలోను ప్రస్తుతం మన దేశంలో డబ్బుకున్న విలువలేదు. మిగతా దేశాలకి, అక్కడి ప్రజలకి డబ్బు అవసరంలేదు—కాని మనిషి బతుకు డబ్బులో ఇంతగా ముడి పడ్డది మనదేశంలోనే!
మళ్ళీ కష్టపడకుండా ఎక్కువ డబ్బు సంపాయించ గలిగేదీ ఈ దేశంలోనే! నీతిని, న్యాయాన్ని పక్కకి నెట్టేసి సంపాయించడమే ధ్యేయంగా పెట్టుకుంటే డబ్బు సంపాయించడం ఈ దేశంలోనే సులభం.
సాంఘిక విలువల్ని, నైతిక సూత్రాల్ని పక్కకి పెట్టి కొందరు ఓమూల డబ్బు కూడబెడుతుంటే- న్యాయంగా, హాయిగా, నీతిగా బతుకుదామనుకున్నవాడు, వెర్రివాడుగా జమ కట్టబడి కనీసావసరాలకు ఇబ్బంది పడ్తూ దిన దిన గండం నూరేళ్ళాయుష్షుగా బతుకుతున్నాడు.
రామనాథం ఆకోవకు చెందిన వాడు.
"రాయవేలూరు వెడితే ఈయన రోగం తగ్గుతుంది"
ఓ డాక్టర్ అన్నాడు.
"ఎంత ఖర్చవుతుంది?"
ఏమాత్రం సంకోచించకుండా, సిగ్గుపడకుండా సుభద్ర అడిగిన ప్రశ్న.
(మొగుడు చావుబతుకుల్లో ఉంటే ఓ ఇల్లాలు ఇలాంటి ప్రశ్న

అడిగే పరిస్థితులున్నందుకు ఈజాతి సిగ్గుపడాలి. కాని మనం ఆపదల్ని అధికమించి బతుకుతున్నాం.)

అదే మాట భర్తతో చెప్తే రామనాథం ఏమీ మాట్లాడలేదు. 'మరో అయిదువేలు అప్పు సంపాయించడం కన్నా చచ్చిపోవడం సులువు' అన్నట్టుగా చూశాడతను.

ఆ రాత్రే రమేష్ తల్లితో చెప్పాడు.

"రావుగార్కి తెల్సినాయన బాంక్‌లో పెద్ద ఆఫీసరున్నాట్ట. ఆయన తల్చుకుంటే బాంక్‌లో ఉద్యోగం వేయించగలడట. కాని...."

"ఊఁ కాని...." సుభద్ర ఆత్రంగా అడిగింది.

"అయిదువేలు కావాలిట."

ఉస్సురుమనిపించింది.

సుభద్రకి నవ్వువచ్చింది.

అయిదువేలుంటే చావు బతుకుల్లో వున్న మొగుడికి వైద్యం చేయించవచ్చు. పూర్వంలా లేచి తిరగలేకపోయినా, కనీసం బతుకుతాడు.

అయిదువేలుంటే తన కొడుక్కి బాంక్‌లో ఉద్యోగం కొనుక్కోవచ్చు. అతను సంపాయిస్తాడు. తల్లిని, తమ్ముణ్ణి, చెల్లెల్ని, సుఖపెడతాడు. తండ్రికి వైద్యం చేయిస్తాడు. అతని అప్పులన్నీ తీరుస్తాడు.

ఒక్క అయిదువేలుంటే ఏం చెయ్యాలి? భర్త వైద్యమా? కొడుకు వైద్యమా?

సుభద్ర నవ్వుకుంది.

మర్నాటికి బియ్యం లేవు. వేల గురించి ఆలోచన.

రామనాథం ఆఫీసుకి అప్లికేషన్ పంపాడు.

"నేను చావు బతుకుల్లో ఉన్నాను. ప్రభుత్వం కనుక అయిదువేలు అప్పు ఇస్తే రాయవేలూరు వెళ్ళి వైద్యం చేయించుకుంటాను మంజూరు చేయించండి" అదే దాని సారాంశం.

సుభద్ర వెళ్ళి ఆఫీసర్ని కల్సింది.

"అలా ఇవ్వడానికి రూల్సు ఒప్పుకోవమ్మా" అన్నాడాయన.

"ఎలాగో మీరే ఆదుకోవాలి. ఆయన ఉద్యోగంలో చేరాక జీతంలో కట్టుకుంటారు. ఒకవేళ" ఆమెకేదో గొంతులో అడ్డుపడింది.

ఆఫీసర్ తలెత్తి ఏమిటన్నట్టు చూశాడు.

"ఒకవేళ ఆయనపోతే ఆయనకొచ్చే గ్రాట్యుటీలో మినహాయించుకోండి" ఆమెకళ్ళల్లో నీళ్ళు.

ఆఫీసర్ జాలిపడ్డాడు. సాను

భూతి చూపించాడు. రూల్సు వున్న పెద్ద పెద్ద పుస్తకాలన్నీ తిరగేశాడు హెడ్డాఫీస్‌కి ఫోన్ చేసి కనుక్కు న్నాడు. అందరూ ఒకటే మాట చెప్పారు. పుస్తకాలన్నీ అదే చెప్పాయి.

అయిదువేలు అప్పు యివ్వ డానికి రూల్స్ ఒప్పుకోవు.

ప్రజలచేత, ప్రజలకోసం, ఎన్నుకోబడ్డ ప్రజల యొక్క ప్రభుత్వం.

రామనాథం పరిస్థితి మరీ విష మించింది.

ఉదయమే డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాడు. గంటకో డోస్ చొప్పున మందు ఇమ్మని చెప్పి వెళ్ళాడు.

* * *

సుభద్ర కంగారుగా తల ఎత్తి చూసింది.

ముసలి గోడగడియారం....

పదకొండు ఏభై అయిదు నిము షాల దగ్గర ఆగిపోయింది.

పన్నెండు గంటలకి మందు వెయ్యాలి. తన ఆలోచనలతో గమ నించనేలేదు. అయిదు నిమిషాలు తక్కువ పన్నెండుకి గడియారం ఆగిపోయింది.

బాణంలా భర్త పడుకున్న గది లోకి వెళ్ళింది.

ఎంత వేడి ఉంటుందో తనకు బాగా తెల్సున్న భర్త శరీరం....

చల్లగా.... జడపదార్థంలా....

ఘొల్లుమంది.

* * *

తను మందువేసుంటే భర్త బతికేవాడేమోనన్న బాధ సుభద్రను కొన్నాళ్ళు పీకింది.

బతికినా ఎన్నాళ్ళు....? అదే లేవలేనిస్థితిలో జీవచ్ఛవంలా మంచం మీదే —

రామనాథం ప్రావిడెంటు ఫండంతా వైద్యానికి ఖర్చుపెట్టే సాడు. ఆఫీసులో మిగతా లోన్లు పోను గ్రాట్యుటీ కొద్దిగావస్తే దానితో అప్పులు తీర్చారు.

"అయిదువేలు అప్పు ఇస్తే వైద్యం చేయించుకుని బతుకుతాము" అని ప్రభుత్వోద్యోగి అడిగితే రూల్స్ ఒప్పుకోవు" అనే ప్రభుత్వం అదే ఉద్యోగి చచ్చిపోతే పదివే లిస్తుంది.

అందులో సగం కిరాణాకొట్టు బాకీ, బియ్యంకొట్టు బాకీ తీర్చ డానికి - అంత్య క్రియలకోసం చేసిన అప్పు తీర్చడానికి సరి పోయింది.

ఇక మిగిలింది - ఐదువేలు....

అయిదువేలు ఖర్చు పెడితే రమేష్‌కి బాంక్‌లో ఉద్యోగం ఇస్తారు. బాంక్‌లో ఉద్యోగం

మంచిది. అతను ఉద్యోగం చేస్తూ తమ్ముణ్ణి చదివిస్తాడు, చెల్లెలిపెళ్ళి చేస్తాడు.

ఇన్నాళ్ళు తనుపడ్డ బాధలేవీ ఇకముందు పడక్కర్లేదు. బండి చక్రంలా అతనింక అలిసిపోనక్కర్లేదు. ముళ్ళచక్రాలబాధ, చీకటి భయం, డబ్బుకోసంపడే యాతన, అప్పుకోసం తాపత్రయం తప్పుతాయి. తను కడుపునిండాతిని, పిల్లలకింత పెట్టొచ్చు అనుకుంది.

ఆమనిషితోటే ఆ బాధలు, దారిద్ర్యంపోయాయనుకుంది. ఎండిపోయిన వృక్షాలు కాలిపోతే తప్ప కిందమొక్కలు పెరిగి పెద్దవికావనుకుంది.

భర్త మరణంవల్ల వచ్చిన డబ్బుతో కొడుక్కి ఉద్యోగం కొనిపెట్టింది.

* * *

సంవత్సరం దాటేక రమేష్ తల్లితో "నేను ఫలానా అమ్మాయిని చేసుకుంటానన్నాడు" అదివిన్న సుభద్ర "అలాగే బాబూ! నీకు నచ్చినపిల్లనే చేసుకో" అంది. అతని పెళ్ళయ్యింది.

"నాకీ ఇంట్లో సుఖంలేదు"

"నాకీ ఇంట్లో ప్రైవసీలేదు" అన్నాడు రమేష్.

కొన్నాళ్ళుపోయాక—

"నేను వేరే ఉంటాను" అన్నాడు రమేష్. రమేష్ ఇల్లు కట్టుకోడానికి స్థలం కొన్నాడని తెల్సి తల్లి సంతోషించింది. అతను స్కూటర్ కొనుక్కున్నాడని తెల్సి ఆనందపడింది.

రోజులు సాగుతున్నాయ్....

రెండో కొడుకు కప్పులేని గవర్నమెంటు స్కూలుకి సగం పుస్తకాలతో వెడుతున్నాడు.

కూతురు జాకెట్టుకున్న చిరుగుకి భయపడి మిషన్ కుట్టు నేర్చుకోడానికివెళ్ళడంమానేసింది.

మర్నాటికి బియ్యంలేవు.

ఏకొట్లో అరువుఅడగాలో అర్థంగాక సుభద్ర సరిపోని ఫామిలీ పెంక్షన్ ఎప్పుడొస్తుందోనని తేదీలు లెక్కపెట్టుకుంటోంది.

సుభద్ర కిటికీలోంచి బైటికి చూస్తోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అందరూ ఎక్కడో అక్కడ సర్దుకునే సమయమది. ఎండ వంద రూపాయల నోటులా భయంకరంగా కోపంగా ఉంది!

సుభద్ర తలపైకెత్తి చూసింది.

మునలిగోడ గడియారం......

పదుకొండు ఏభై అయిదు నిమిషాలకి ఆగిపోయింది.

అదింక కదలదు. ✱